"అన్నా! టెండర్లెయ్యనీకి కృష్ణారెడ్డి మనుషుల్తో టవున్లో కొచ్చినాడు!" సుబ్బరాయుడు హడావుడిగా చెప్పాడు రామిరెడ్డితో.

సుబ్బరాయుడు రామిరెడ్డి ముఖ్య అనుచరుడు. రామిరెడ్డి రాజకీయాలు, లవాదేవీలు అన్నీ సుబ్బరాయుడుకు తెలిసే జరుగుతాయి. రెండెకరాల ఆస్తి ఉండే సుబ్బరాయుడు రామిరెడ్డి కుడి భుజమయ్యాక కోట్లకు పడగెత్తి కోటల్లాంటి భవంతులు కట్టాడు.

సుబ్బరాయుడు చెప్పింది వినగానే నాటుబాంబు తగిలి చిమ్మిన ఎర్రటి రక్తంలా రామిరెడ్డి ముఖం కోపంతో ఎర్రగా జేవురించింది. చేతిలో ఉన్న సిగరెట్‌ను యాష్ ట్రేలో వేసి తన ప్రత్యర్థులను అణచినట్లు నలిపేశాడు.

"పోన్లే అని చూస్తా వుంటే ఈ కృష్ణారెడ్డి యవ్వారం రాన్రాను జాస్తయిపోతాంది. ఇంగ వూరుకోనుంటే మనమీనే యేటేసుట్లున్నాడు. ఇద్దరం ఒకే పార్టీలో ఉన్నన్నాళ్లు పార్టీ టికెట్టుకు అడ్డం పడ్తా ఉండె. మనం ప్రాంతీయ పార్టీకి మారినాంక ఎలక్షన్లలో పోటీ తగుల్తాన్నాడు. సారాయి యాలం దగ్గర అడ్డం పన్నాడు. మొన్న లైన్ షాపుల కోసం మన్తో పోటీకొచ్చినాడు. ఇపుడు కాంట్రాక్టుల కాడకూడ అడ్డం పన్నీకి తయారైనాడు. ఇంగ ఈళ్ల కత అటో ఇటో తేల్చాల్సిందే!" నిప్పులు కక్కుతూ స్కాచ్ విస్కీ గ్లాసెత్తి గటగటా తాగాడు.

"అన్నా! కృష్ణారెడ్డి బలమంతా ఆయనెంటుండే రంగారెడ్డి వల్లనే. వాడే ఆయనకన్నీ నేర్పించేటోడు. గలాటాలొచ్చినపుడు ముందు నిలబడేది వాడే! ఆయనకు నాటుబాంబులు చుట్టిపిచ్చేది వాడే! వాన్నేసేసినామంటే కృష్ణారెడ్డి కుక్కిన పెన్లెక్క పడుంటాడు!" సుబ్బరాయుడు వివరించాడు కుర్చీలో కూర్చుంటూ.

# గుడ్ విల్

## డాక్టర్ గుర్రాల రవికృష్ణ




"రేపు టెండర్ల పనైనాంక సందుచూసి వాన్నేపించేయాల. బోయ రాజిగాని ముఠాకు వీన్నేసియ్యనీకి కాంట్రాక్ట్ మాట్లాడు, పనైపోతాది మన చేతులకు చుక్క నెత్తురంటకుండ. ఆ టైంలో నేను హైదరాబాద్‌లో ఏదైనా ఆసుపత్రిలో చేర్తా. మనకు 'ఎలిబీ' వుంటాది కేసయినాగాని!" త్రిబుల్ ఫైవ్ సిగరెట్ వెలిగిస్తూ అంటున్న రామిరెడ్డి ముఖంలో క్రౌర్యం అంటించిన సిగరెట్‌లా ఎర్రగా మండుతోంది.

రాయలసీమలో ఎండిపోతున్న భూములకు సేద్యపు నీరు అందించే భారీ నీటి ప్రాజెక్టు ప్రారంభ పనులకు టెండర్లు పిలిచారు. అయిదు కోట్ల అంచనాతో మొత్తం పనిని యాభైలక్షల విలువ చేసే పది పనులుగా విడగొట్టి టెండర్లకు ప్రకటన వచ్చింది. నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీసులో టెండర్ల బాక్స్ పెట్టారు. టెండర్లు వెయ్యడానికి రామిరెడ్డి, కృష్ణారెడ్డితోపాటు మరో పదిమంది ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇ.ఎం.డి.) కట్టి షెడ్యూల్స్ తీసుకున్నారు. రామిరెడ్డి, కృష్ణారెడ్డి ఇద్దరూ కాంట్రాక్ట్‌కోసం పోటీ పడుతుండటంతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

రామిరెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబాల మధ్య తగాదాలు రెండుతరాలనుండి రావణకాష్టంలా సెగలు కక్కుతున్నాయి. తమ నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ముఠాలు పెంచి పోషిస్తున్నారు, ఇద్దరూ. గతంలో ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నప్పుడు కూడా వారి మధ్య సయోధ్య లేదు. ఒక వరలో రెండు కత్తులిమడలేవంటూ రామిరెడ్డి కొత్త ప్రాంతీయ పార్టీ వచ్చాక అందులో చేరిపోయాడు. అప్పటి నుండి వారి మధ్య ముఠాకక్షలు మరింత పెరిగి పెద్దవయ్యాయి.

ఒకప్పుడు కేవలం భూస్వాములుగా చెలామణి అవుతూ భూమిమీద వచ్చే ఆదాయం ఖర్చుపెట్టి ముఠాలు నడిపేవారు. నెమ్మది నెమ్మదిగా వీరిని, వీరి ముఠాల నేపథ్యాన్ని చూసి ప్రజలు భయపడటంతో, ఈ ఫ్యాక్షన్ ఉపయోగించి రకరకాల ఆదాయ మార్గాలు కనిపెట్టారు. ఆస్తి తగాదాలు పంచాయితీ చేసి పర్సంటేజి తీసుకోవడం, లేదా ఆ ఆస్తినే అగ్గువలో కొనెయ్యడం. అప్పులు చేసిన వ్యాపారస్తులకు అప్పులు కట్టమనే వారినుండి రక్షణ ఇచ్చి, వారికున్న ఆస్తిపాస్తులు తమ పేరిట రాయించుకోవడం, సారాయి వ్యాపారం, కాంట్రాక్టులు, ప్రైవేటు వ్యక్తులవి, ప్రభుత్వానివి భూములు, ఆస్తులు కబ్జా చేయడం. ఈ పనులకు



అడ్డం వచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా తొలగించడం బాగా నేర్చుకున్నారు.

ఆ రకంగా వచ్చిన కోట్ల రూపాయలతో విలాసవంతమైన భవంతులు, ఖరీదైన కార్లు, కొడవళ్లు, గొడ్డళ్ళ స్థానంలో మెషిన్ గన్‌లు వచ్చాయి. అనుచరులకు కావలసినంత సారాయి పోయించి వెంట తిప్పుకుంటారు. రాయలసీమలో నీళ్లకే కరవు కానీ, సారానీళ్లకు కొదవలేదు. అనుచరులు వారి ఆదాయానికి దారి దోపిడీలు, నేరాలు చేస్తే వారికి నాయకులు పోలీసుల నుండి రక్షణ కల్పిస్తారు.

బద్ధ శత్రుత్వం ఉన్న రామిరెడ్డి, కృష్ణారెడ్డి రేపు టెండర్లలో పోటీ పడుతుండటంతో, ప్రజలు ఎప్పుడు ఎక్కడ బాంబుల మోతలు వినిపిస్తాయోనని భయం భయంగా ఉన్నారు.

"రేపు టెండర్లెయ్యనీకి పదిమంది కాంట్రాక్టర్లు ఇ.ఎం.డి. కట్టి షెడ్యూల్లు తీసుకున్నారంట!" ఇంకో సమాచారం అందించాడు సుబ్బరాయుడు.

"వాళ్లందర్ని మనకంటె ఎక్కువ 'కోట్'చేసి టెండర్లెయ్యమని ఫోన్జేసి చెప్పు. చెప్పినట్లినకుంటె తలకాయల్లేస్తాయన్జెప్పు!" నింపాదిగా అన్నాడు రామిరెడ్డి.

అదే సమయంలో ఫోన్ మోగింది. సుబ్బరాయుడు ఫోనెత్తి, "హలో!" అన్నాడు. "ఎవరు? కృష్ణారెడ్డి మాట్లాడతాడా అన్నతో! ఏంది సంగతి? కాంట్రాక్ట్ గురించా! దాని గురించి మాట్లాడేదేముంది? ఎవరొచ్చినా ఆ కాంట్రాక్ట్ మాదే! ఎవరన్నా అడ్డం పడ్డా వూరుకునేది లేదు!" అని ఫోన్‌లో మాట్లాడి, "అన్నా! కృష్ణారెడ్డి నీతో మాట్లాడాలంట!" అని ఫోన్ రామిరెడ్డికి ఇచ్చాడు.

ఫోన్లో కృష్ణారెడ్డి ఏ విషయం చెప్పాడో గాని, మాట్లాడుతున్న రామిరెడ్డి ముఖంలో కొత్త విషయం కనిపెట్టిన సైంటిస్ట్‌లా ఆనందం కనిపిస్తోంది. "అట్లే కాని, రేపు గెస్ట్ హౌస్‌లో కల్సి డిసైడ్ చేస్తాం!" అని కృష్ణారెడ్డితో చెప్పి ఫోన్ పెట్టేశాడు రామిరెడ్డి.

● ● ●

ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లోని ఒక గదిలో రామిరెడ్డి, కృష్ణారెడ్డి ఒకే సోఫాలో పక్కపక్కనే కూర్చున్నారు! చూసేవాళ్లకు ఇది కలా, నిజమా! అనిపించినా, అది భూమి గుండ్రంగా ఉందన్నంత పచ్చి నిజం.

నిన్నటిదాక వాళ్లిద్దరూ బద్ధశత్రువులు. రేపటినుండి కూడా వాళ్లిద్దరూ శత్రువులే. కేవలం ఈ రోజుకు మాత్రం వాళ్లిద్దరూ మంచి మిత్రులైపోయారు.

వారికి ఎదురుగా టెండర్లు వెయ్యడానికి ఎర్నెస్ట్ మనీ డిపాజిట్లు కట్టి టెండర్ షెడ్యూళ్లు తీసుకున్న పదిమంది కాంట్రాక్టర్లు కూర్చున్నారు. ఆకలిగొన్న పులుల గుహలోకి పొరపాటుగా ప్రవేశించిన చిన్న జీవాలలో కన్పించే భయం వారి ముఖాల్లో కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

కృష్ణారెడ్డి మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"రేపు కాంట్రాక్ట్ పని మేమే చెయ్యాలని ముందనుకోనింటిమి. కాని మీరంతా కూడా కాంట్రాక్ట్ పని కోసరమొచ్చినారని ఈసారికి మీలో ఎవరో ఒకరికి ఆ కాంట్రాక్ట్ ఇప్పించాలని డిసైడ్ చేసినాం. మేమీడ డిసైడ్ చేసినోళ్లే రేపు టెండరేస్తారు. గవర్నమెంట్ చెప్పిందానికన్నా యాభై పర్సెంట్ ఎక్కువేసి టెండరేసుకోవచ్చు. కాంట్రాక్ట్ తీసుకున్నోళ్లకు ఎంత లేదన్నా రెండు కోట్లన్నా



## పదికాలాలు నటుడిగా నిలబడా లన్నదే నా ఆశ!

'పట్టుకోండి చూద్దాం', 'దొంగాట' చిత్రాల్లో వైవిధ్యమైన నటనను ప్రదర్శించిన సురేష్ 'ఓ పనైతుంది బాబూ' చిత్రంలోకూడా అదేస్థాయిలో నటించాడు. చిత్రం ఆశించినంత గుర్తింపు పొందలేదు. సురేష్‌ని ఆంధ్రా కమల్‌హాసన్ అని దర్శకుడు శివనాగేశ్వరరావు అభివర్ణించాడు.

ఇటీవల 'హలో యమ' చిత్రంలో హీరోగా నటిస్తున్న సురేష్‌తోబాటు యూనిట్ అంతా రామానాయుడు స్టూడియోస్ సెట్‌లో నవ్వులు వెదజల్లుతున్నారు. సురేష్ యముడ్ని బోల్తా కొట్టించే సన్నివేశం. దృశ్య చిత్రీకరణ ఒకే అయిన తర్వాత "మీ కెరీర్ కో ప్లానింగ్ ఉండదు, అందువలనే మీ సక్సెస్ గ్రాఫ్ కన్ఫ్యూజింగ్‌గా ఉంటుంది!" అనంటే...

"లేదండీ! ప్లానింగ్‌తో ఇండస్ట్రీలో సాధించేది చాలా తక్కువ! మన ప్రయత్నం మనం చేస్తాం. అదృష్టం కలిసిరావాలి. నేను ఓవర్‌నైట్ హీరోగా అయిపోయి, మళ్లీ ఓవర్‌నైట్ కనుమరుగై పోవడం నాకిష్టం లేదు. నటుడిగా పదికాలాలు నిలబడాలన్నదే నా ఆకాంక్ష!" అన్నాడు.

**-ఐ.ఆర్.**

మిగుల్తాయి. దాంట్లో నాకు, రామిరెడ్డికి చెరో నలభై లక్షలు, మిగిల్న కాంట్రాక్టర్లకు తలా ఒక లక్ష 'గుడ్‌విల్' ఇయ్యాల. ఎవరికి కావాల్నో డిసైడ్ చేసుకోండి!" చెప్పడం పూర్తి చేసి సిగరెట్ వెలిగించుకున్నాడు కృష్ణారెడ్డి.

కాంట్రాక్టర్లంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఎవరికీ నోరెత్తే ధైర్యం చాలడంలేదు.

పెద్దతరహాగా ఉండి, గౌరవభావం కలిగించే విధంగా ఉన్న ఒక కాంట్రాక్టరు నోరిప్పాడు.

"ఆ కాంట్రాక్ట్ నిర్ణయించిన విలువకే పనిచేసినా, చేసినవాళ్లకు కొంత లాభముంటుంది. యాభై పర్సంట్ ఎక్సెస్ వెయ్యడం ప్రజల డబ్బు పబ్లిగ్గా దోచుకోవడమే. కావాలంటే ఓ పదిశాతం ఎక్కువ వేసుకుని కాంట్రాక్ట్ తీసుకోవడం న్యాయంగా ఉంటు ..." అతను మాట పూర్తి చెయ్యకముందే రామిరెడ్డి కోపంగా, విసురుగా లేచి అతని దగ్గరకు వచ్చి.

"అవన్నీ నీవు చెప్తే గాని తెల్సుకోలేని ఎర్రి నాయాల్లనుకొన్నావా మమ్మల్ని? పెద్ద పోటుగాన్లెక్కలేసి ధర్మరాజు పోజులు పెట్టి నీతి కతలిన్పిస్తా ఉండావ్! ఈడ మేం ఏం చెప్తే అదే వేదం. మేం ఏం చేస్తే అదే న్యాయం. మేం నిర్ణయించిందే ధర్మం. మా మాట కెదురు చెప్పేటోల్లిక్కడుండనీకి లేదు. నీకిష్టం లేకుంటే ఈడ్నిండిట్లే ఎల్లిపో! ఎక్కువ మాట్లాడకు. మా కడ్డమొచ్చినోల్లను ఎట్లా మాట్లాడకుండా చేయాల్నో మాకు తెల్సు!" బుసలు కొట్టాడు రామిరెడ్డి.

అక్కడ కూర్చున్న అందరి వెన్నుల్లో భయం జరజరపాకింది.

ఆ పెద్దాయన లేచి "సార్! మీ పన్లకు అడ్డం వచ్చేంత గొప్పవాన్ని కాదు. అంత ధైర్యం నాకు లేదు. అలా అని మీరు చెప్పినట్లు చేయడానికి నా అంతరాత్మ అంగీకరించదు. న్యాయంగా కాంట్రాక్ట్‌లు చేసి నిజాయితీగానే నేను ఇంతకాలం సంపాదించాను. మీరిప్పించే లక్ష 'గుడ్‌విల్'కి ఆశపడే అవసరం నాకు లేదు. ఏదో రాయలసీమ కరువు తీర్చే ప్రాజెక్టుకు నా వంతు కృషిచేద్దామని ఇంత దూరం వచ్చాను. మీకు ఎదురు చెప్పేటంతవాన్ని కాదు!" అంటూ తన టెండర్ షెడ్యూలు అక్కడే చింపేసి నిదానంగా వెళ్లిపోయాడు.

"పోతే పో! నీవద్దన్న లక్ష ఆఫీసులో చిల్లర ఖర్చులకు పనికొస్తాయి, కాంట్రాక్ట్ తీసుకున్నోల్లకు!" అంటూ కృష్ణారెడ్డి కాంట్రాక్టర్ల వంక తిరిగి, "మీలో ఎవరికి కావాల్నో తేల్చుకోండి, ఎక్కువమంది కావాలంటే ఈడ్నే 'ఆక్షన్' పెట్టి ఎవరెక్కువ మాకు 'గుడ్‌విల్' ఇచ్చుకుంటారో వాళ్లకు కాంట్రాక్ట్ ఇప్పిస్తాం. అంతా కాష్, స్పాట్ పేమెంట్ జరగాల. మళ్లా ఇస్తామనడం, చెక్కులు గిక్కులు కుదరవ్!" వివరించాడు.

నలుగురు వాళ్లు చెప్పినట్లు చేయడానికి ముందుకొస్తే, వాళ్లల్లో చెరో అయిదులక్షలు ఎక్కువ 'గుడ్‌విల్' సమర్పించుకుంటానన్న వ్యక్తికి కాంట్రాక్ట్ టెండర్ యాభై పర్సెంట్ ఎక్సెస్ వేసి వేసుకోమని పర్మిషన్ ఇచ్చారు. మిగిలిన వాళ్ల టెండర్ షెడ్యూల్స్ లాక్కుని కొన్నింటిని చింపేశారు. ఓ రెండింటిలో మాత్రం యాభై పర్సంట్ కంటే ఇంకా ఎక్కువ కోట్ చేసి టెండర్లు వెయ్యాలని పథకం నిర్ణయించారు. అపుడు ఖచ్చితంగా వీళ్లు నిర్ణయించి, 'గుడ్‌విల్' ఇచ్చిన మనిషికే కాంట్రాక్ట్ దక్కుతుంది.

● ● ●

నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీసులో టెండర్ల బాక్స్ పెట్టారు.

రామిరెడ్డి, కృష్ణారెడ్డి వేయమని చెప్పిన టెండర్లు మాత్రమే బాక్సులో పడ్డాయి.

ఆఫీసుకు కొద్ది దూరంలో ఆగిన బ్లూ కలర్ టాటా సుమోలో రామిరెడ్డి, కృష్ణారెడ్డి కూర్చున్నారు. కారుకున్న నల్లటి అద్దాలనుండి లోపల కూర్చున్నవారు బయటకు కన్పించరు, వారి నిజస్వరూపాల్లాగే.

ఇంతలో హడావుడిగ కృష్ణారెడ్డి అనుచరుడొకడు ఉరుకులు పరుగులుగా గసపెడ్తూ వచ్చి, "అన్నా! ఎవరో కాంట్రాక్టరు, టెండర్ షెడ్యూల్ హైదరాబాదులో తీసుకున్నాడంట, మనకా సంగతి తెల్దు! ఇప్పుడు వాడు టెండర్ వెయ్యడానికి ఆఫీసులోకి పోతున్నాడు!" చెప్పాడు.

"రేయ్! పోయి వాన్నీడకు లాక్కరండి! వాని కత ఈడ్నే తేలుస్తాం!" కృష్ణారెడ్డి చెప్పే చెప్పంగానే అనుచరులు ఆఫీసు దగ్గరకు పోయి లోపలికి పోతున్న కాంట్రాక్టరును "కృష్ణారెడ్డన్నా, రామిరెడ్డన్నా తోల్కరమ్మన్నారు!" అని ఒక మాట చెప్పి అతన్ని లాక్కొచ్చి సుమోలో ఎక్కించారు.

"ఏం? బతకాలని లేదా? మా సంగతెల్తెలిక పొరపాట్న టెండరెయ్యనీకి పోతుండావా, లేకుంటే తెల్సే పాలెగాన్లెక్క టెండరెయ్యనీకి వచ్చినావా? ఈడ్నిండిట్లే యెనక్కి తిరిగి సూడకుండ యెల్లిపో! ఇంగ అతికెం చేసి టెండరేస్తానని నీల్గినావంటే, నీ తలకాయ ఈడ్నే తెగిపడ్తాది. నీ మొండెం పూరవతల ఏట్లో తేల్తాది!" రామిరెడ్డి గుడ్లురిమి చూస్తూ విరుచుకుపడ్డాడు.

ఆ కాంట్రాక్టర్ గజగజా వణికిపోతూ, "లేదన్నా! ఈడ సంగతులేవీ నాకు తెలీదు. నేనీరోజే తిరుపతి నుండి నేరుగా టెండరెయ్యనీకి ఆఫీసుకాడికి వచ్చిన! మీకడ్డం పడేటంతటోన్నా! నన్నిడిచిపెట్టండన్నా!" దీనంగా వేడుకున్నాడు.

'సరే, పో!' అంటూ కృష్ణారెడ్డి అతని దగ్గర టెండర్ షెడ్యూలు తీసుకుని వెళ్లిపొమ్మన్నాడు.

ఆరోజు సాయంత్రం గెస్టుహౌస్‌లో రామిరెడ్డి, కృష్ణారెడ్డి కూర్చుని తర్వాతి కార్యక్రమం చర్చిస్తుండగానే, హైదరాబాద్ నుండి రామిరెడ్డి కుడి భుజం సబ్బరాయుడు ఫోన్జేశాడు. "అన్నా! ఈడ అంతా పని సాఫీగా అయిందన్నా! చీఫ్ ఇంజనీర్ ఆఫీసులో టెండర్లెయ్యనీకి ముగ్గురు కాంట్రాక్టర్లు వచ్చినారు. వాళ్లను మా కార్లో ఎక్కించుకుని టెండర్ టైమ్ అయ్యేటంతవరకు మాకాడ్నే పెట్టుకున్నాం. టైం అయినాక ఈ సంగతి పోలీసోళ్లగ్గాని, పేపరోల్లగాని చెప్తే మీవాళ్లకు మీరు దక్కరని బెదిరించి వదిలిపెట్నాం!" చెప్పాడు. పెద్ద కాంట్రాక్ట్ పనులకు హైదరాబాదులో కూడా టెండర్లు వేయడానికి బాక్స్ పెడ్తారు.

"సరే, ఈడగూడా అంతా బానే జరిగింది. నీవాడ్నే వుండు. నేను రాత్రి బయల్దేరి ఆడికే వస్తున్నా!" ఫోన్‌లో చెప్పాడు రామిరెడ్డి.

రామిరెడ్డి, కృష్ణారెడ్డి 'గుడ్‌విల్' కింద కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి ఇచ్చిన డబ్బు చెరో నలభై అయిదు లక్షలు పంచుకుని, మిగిలిన కాంట్రాక్టర్లకు తలా ఒక లక్ష భిక్షం పడేసి స్కాచ్ విస్కీ గ్లాసులు పైకెత్తి 'ఛీర్స్' చెప్పుకున్నారు.

ఆరోజు రాత్రి ...

పల్లెలో కృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడు రంగారెడ్డిపైన బాంబులతో దాడి జరిగింది. బాంబులేసి జనాల్ని చెదరగొట్టి, రంగారెడ్డి బాంబు తగిలి కింద పడగానే కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఇది జరిగిన వెంటనే కృష్ణారెడ్డి మిగిలిన అనుచరులు, రంగారెడ్డి బంధువులు కలిసి రామిరెడ్డి అనుచరుల ఇళ్లు, గడ్డివాములు, గోడౌన్లు అగ్నికి ఆహుతిచ్చారు.

అదే సమయంలో ...

రామిరెడ్డి ఉన్న బ్లూ టాటా సుమో, కృష్ణారెడ్డి ఉన్న తెల్లటి టాటా సఫారీ మెత్తగా హైదరాబాదువైపు సాగిపోతున్నాయి. వాటి వెనుక సీట్లలో డబ్బులున్న సూట్‌కేసులు మత్తుగా పడి ఉన్నాయి. వారి పల్లెలో ఆకాశమెత్తు లేచిన ప్రతీకార జ్వాలలు వీరిద్దరినీ 'మాత్రమే' ఎందుకో ఎప్పుడూ అందుకోలేకపోతున్నాయి. ■



## అదృష్టజాతకుడు కృష్ణమోహన్

**ఒ**కప్పుడు లక్షాధికారి అంటే ఘనంగా చెప్పుకునేవారు; రానురానూ వారికి విలువ తగ్గి, కోటీశ్వరులను గొప్పగా చెప్పుకోవడం ప్రారంభించారు. జీవితాంతం కుటుంబసభ్యులందరూ కష్టించి పనిచేసినా, కోటీశ్వరులు కాగలరా? అటువంటిది విజయవాడ వాసి శ్రీ కోలా వెంకటకృష్ణమోహన్‌ను సాక్షాత్తు కనకమహాలక్ష్మి తలుపుతట్టి మరీ 80 కోట్లరూపాయల జాక్‌పాట్‌ను అందించింది. నిజంగా అదృష్టవంతుడంటే ఆయనే! భవానీపురం ఇంద్రకీలాద్రి అపార్టుమెంట్‌లోని మధ్యతరగతి కుటుంబీకుడైన కృష్ణమోహన్ చిన్నచిన్న కాంట్రాక్టులు చేస్తూ ఉన్నతస్థితికి వచ్చాడు. 1998 ఆగస్టులో లండన్ వెళ్లినప్పుడు హీత్రూ విమానాశ్రయంలో కొన్న మాగజైన్‌లోని 'ఎర్న్ ఎ మిలియన్ డాలర్' ప్రకటన చదివి, రు.25,000/- పెట్టి లోట్టో కంపెనీ లాటరీటికెట్ కొన్నారు. డిసెంబరు అయిదవ తేదీన ఆయనకు ఫారిన్ మెయిల్‌లో రు.80 కోట్లు బహుమతి వచ్చినట్లు సమాచారం అందింది. తర్వాత ఫోన్‌లో ఆయనకు గ్రీటింగ్స్ అందాయి. విజయవాడలో కృష్ణమోహన్‌తో సాగిన ఇంటర్వ్యూ:

**మీగురించి కొంత చెబుతారా?**

"మా తండ్రిగారు కంట్రాక్టులు చేస్తూ, గుంటూరు జిల్లా బాపట్లనుండి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. మా సోదరులుకూడా కంట్రాక్టులు చేస్తున్నారు. నేను హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంట్రాక్టరులైన గామిన్ ఇండియా సంస్థకు సబ్ కంట్రాక్టర్ని. కొంతకాలం గల్ఫ్ దేశాలకు ఆపిల్స్, దానిమ్మ, మామిడిపండ్లు పంపేవాడిని. గల్ఫ్ యుద్ధంలో మేమూ నష్టపోయాం. తర్వాత ఎస్.టి.డి. టెలిఫోన్ బూత్‌ను ప్రారంభించాను. అదీ మూతపడింది. షేర్లు కాని, లాటరీ టికెట్లు కాని కొనే అలవాటు నాకు లేదు."

**మీ హాబీలు?**

"ఇంటర్‌నెట్‌లో కాలం గడపడం. మా ఇంట్లో హోమ్ థియేటర్ ఉంది. సీడీలు చూస్తాను."

**బహుమతి సైకం ఎప్పుడు వస్తుంది?**

"ఫిబ్రవరి నెలలో...ఆమ్‌స్టర్‌డామ్ వెళ్లి తీసుకోవాలి. నాకు, నా శ్రీమతికి లాటరీ సంస్థవారు రెండు ఎయిర్ టికెట్లు పంపారు."

**లాటరీడబ్బుతో ఏం చేయదలచారు?**

"ఇంకా ఏమీ అనుకోలేదు. ఇన్‌కంటాక్సు, అదీ కట్టినతర్వాత మిగిలినమొత్తం చూసి ఆలోచిస్తాను."

**ఆదాయం పన్నుకింద ఎంత కట్టాల్సి ఉంటుంది? విదేశాలలో టాక్సు తక్కువకాబట్టి అక్కడికెళ్లి స్థిరపడాలనుందా?**

"ఆదాయం పన్నుకింద ఎంత కట్టాలో అంత కట్టాలి. ఇన్‌కమ్‌టాక్సు డిపార్టుమెంటువాళ్లను కలుసుకున్నాను. పన్ను కడితేనే బాగుంటుందని నా అభిప్రాయం. విజయవాడ వదిలివెళ్లే ప్రసక్తి లేదు. నా బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు...అందరూ ఇక్కడే ఉన్నారు."

**అనాథపిల్లల సంస్థ ఎస్.కె.సి.వి. ఛిల్డ్రన్స్ ట్రస్టుకు మీరు పాట్రన్‌గదా?**

"అవునండీ! అనాథబాలల సంరక్షణకోసం సేవ చేస్తాను."

**చాలామంది మిమ్మల్ని కలిసినట్టున్నారు?**

"పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, బాంకు అధికారులు...అందరూ వస్తున్నారు. రకరకాల సూచనలు ఇస్తున్నారు. నాకు అనుభవం లేనిరంగంలోకి నేను వెళ్లదలుచుకోలేదు."

**మీ జీవితవిధానంలో మార్పులు...?**

"ఏమీ లేవండీ! నా లైఫ్ మామూలుగా కొనసాగుతుంది. అయితే, లాటరీ వచ్చినప్పటినుండి కంటిమీద కునుకు లేదు. నా రక్షణనిమిత్తం పోలీసు సహాయం కోరాను. సేవా కార్యక్రమాలకు కొంత ఖర్చు చేయాల్సి ఉంది. ఎగుమతులపై, దిగుమతులపై దృష్టిని సారించాల్సి ఉంది."

**విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోనే కోటీశ్వరుడైన వ్యక్తిగా మీరు గర్వపడుతున్నారా?**

"అంతా దేముడిదయ. కనకదుర్గ, షిర్డి సాయిబాబా, వేంకటేశ్వరస్వామి నా ఇష్టదైవాలు. పన్నులన్నీ చెల్లించడానికి నేను సిద్దంగా ఉన్నాను. విదేశాలలో నేరాలసంఖ్య ఎక్కువ. నాకు విదేశీ కల్చర్ నచ్చదు...ముఖ్యంగా యువతీయువకులు అనుకరిస్తున్న ఫారిన్ కల్చర్. మనదేశంలో కుటుంబవ్యవస్థ ఇంకా పటిష్టంగానే ఉంది" అన్నారు నిరాడంబరంగా, సాదాసీదా మధ్యతరగతి వ్యక్తిలా కనబడే 80 కోట్లకు అధిపతి అయిన కృష్ణమోహన్.

కె. ■